# మనోరంజితం - 11

అభిరామ్ నిట్టూర్చాడు. ‘‘నీకు ఇంతకు ముందు ఓ సారి చెప్పాను కదూ... ఓ చిన్నారికే కలిగించిన ప్రేరణతోనే నేను ఇక్కడకురాగలిగానని...’’

మధ్యలోనే శకుంతల మాట అందుకుంది ‘‘అవును... చెప్పారు.. ఆ చిన్నారికే మీరు తీసిన వీడియోలన్నీ అంకితమన్నట్లు చెబుతూంటారు కూడా. అయితే...? ఇంతకీ ఆ చిన్నారి ఎవరూ...?’’ ఆరా తీసింది శకుంతల.

‘‘ఇప్పుడు కాదు... త్వరలోనే చెబుతాను. కొంచెం సమయం కావాలి. నా అదృష్టం బావుంటే... ఆ చిన్నారిని నీకూ పరిచయం చేయగలనేమో...!’’ అంటూ అభిరామ్ నిట్టూర్చాడు.

ఆ సంభాషణ వలన తమ మధ్య బరువైన వాతావరణం ఏర్పడినట్లుగా అనిపించింది శకుంతలకు. అందుకే తేలిక పరచటానికన్నట్లు... మాటమారుస్తూ ‘‘అవునూ... నేను... ఏం రాస్తున్నారని అడిగితే, న్యూస్ పేపరులోని వార్తల ఆధారంగా నాటికను రూపొందిస్తున్నట్లుగా చెప్పి... మొదటిది... అంటూ ఆ టీచరు వివరం చెప్పారు.. మరి... రెండోది ఏమిటీ...?’’ అనడిగింది.

‘‘ఏదైనా నేను ఈ మందు వ్యసనం గురించిన వార్తనే ఆధారం చేసుకుంటానని తెలుసుగా...’’ అంటూ అభిరామ్ దానినీ వివరించటం మొదలు పెట్టాడు.

‘‘మందులేని విందుకోసం... అనే హెడ్డింగుతో వచ్చిన వార్తా కథనం అది. చదివాక నేను చాలాసేపు ఆ ఆలోచన నుండి బయట పడలేకపోయాను.... మనసు అంత భారంగా మారిపోయింది. ఇంతకీ విషయం ఏమిటంటే... ఒక సాయంత్రం వేళ భార్యా భర్తలిద్దరు తమ చిన్నారి పాపాయితో కలిసి కారులో బయలుదేరారు. సినిమాకా, రెస్టారెంట్ కా లేక మరెక్కడికైనానా అని ముగ్గురు సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో... మద్యం మత్తులో నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులున్న కారు వీరి కారును ఢీ కొట్టింది! ఆ ప్రమాదంతో ఆ కుటుంబం భవిష్యత్తు చీకటైపోయింది!

మద్యం మత్తులో కారు డ్రైవ్ చేస్తున్న విద్యార్థి నిర్వాకమే పాపను బలిగొంది! అప్పటినుండీ పాపను పోగొట్టుకున్న చంద్రశేఖర్ అనే ఉద్యోగి... మందు అనర్థాలను ప్రచారం చేసే ఉద్యమాన్ని ప్రారంభించాడు. అతని మాటలు నాపై ఎంతగా ప్రభావం చూపించాయంటే... అక్షరం పొల్లుపోకుండా నా మనసులో ముద్రించుకుపోయాయి...! ‘కొద్దికాలం మత్తు నూరేళ్ళ జీవితాన్ని చిత్తు చేస్తోంది’. మిత్రులు బలవంతం చేశారనో, కార్యక్రమాల్లో అందరి ముందూ చులకన కాకూడదనే దురభిప్రాయంతోనో మొదలయ్యే మందు అలవాటు ఎన్నో ప్రమాదాలకు కారణం అవుతోంది. అందుకే ‘మద్యం మానేద్దాం... మద్యం వ్యాప్తికి సహకరించను’ అంటూ ప్రతినబూనే సంస్కృతి అందరిలో కలగాలి! ముఖ్యంగా... యువత

సందర్భం ఏదైనా సరే,మందు తప్పనిసరి చేస్తున్నారు. ‘దారులేని దావత్‌లే ఇస్తా... దారు లేని దావత్ అయితేనే వస్తా...’ అనే నినాదం వ్యాప్తి చెందాలి!

బార్లు, రెస్టారెంట్లకు బదులు లైబ్రరీ, పార్కు లాంటి ప్రదేశాలు సమావేశాలకు వేదికలుగా నిలవాలి! పండగంటే మద్యం ఉండాల్సిందేననే పరిస్థితి మారాలి...!’ ఇదంతా ఉద్యమంలా ప్రచారం సాగిస్తున్న అతని మాటలే...! ఇది చదివీ చదవంగానే నా ఆలోచనకు ప్రతిబింబంలా అనిపించి... వెంటనే నాటికలా రూపొందించాలనే నిర్ణయానికి వచ్చేశాను! ప్రయత్నాన్నీ మొదలు పెట్టేశాను...!’’

అభిరామ్ ముగించగానే... శకుంతల లేచి నిలబడి ‘‘మీరన్నట్లుగా చిన్నపిల్లలే... మందు పట్ల నిరసన చూపించటానికి ప్రేరణ కలిగిస్తున్నారన్న మాట...!’’ అంటూ అడుగులు వేసింది బయటకు.

‘‘సరే, మళ్ళీ తీరిగ్గా మాట్లాడదాం...’’ అభిరామ్ మాటలకు శకుంతలా తలవూపింది అలాగే అన్నట్లుగా.

శకుంతల వెళ్ళిపోయాక అభిరామ్ ఆలోచనలో పడ్డాడు.

కుటుంబం ఆవశ్యకతను గుర్తించి, గౌరవించే తను ఏకాకిగా ఉండిపోవటమెందుకని శకుంతల ప్రశ్నిస్తోంది...!

తనకు విడాకులు అయ్యాయనీ, ఒంటరిననీ గుర్తుకు రావటం లేదెందుకనో...! ప్రతీరోజు ఖాళీ సమయం దొరికనపుడల్లా... తను మహిమతోనూ, చిన్నారి వసూ తోనూ కబుర్లు చెప్పుకుంటున్నట్లు అనుభూతి చెందడం వలనేనా... అంతే అయ్యుంటుంది!

నిజమే... వాళ్ళకి భౌతికంగా దూరంగా ఉన్నాడేమోగానీ, మానసికంగా మాత్రం చాలా దగ్గరే.

మహిమనూ, వసూను కలుసుకునే రోజు దగ్గర్లోనే ఉందని గాఢంగా నమ్మటం వలనే కాబోలు... తను ఒంటరిననీ, జంట జీవితం ముగిసి పోయిందనీ గుర్తించలేకపోవటం జరుగుతోంది... అతనికి అయోమయంగా అనిపించింది!

ఆలోచనలు చుట్టుముడుతూనే ఉన్నాయి...!

మహిమను అంతగా ప్రేమించి... తనతో వివాహ బంధం కోసం కలలు కని... తీరా సాధ్యమయ్యాక... ఆ బంగారు జీవితాన్ని ఎలా వదులుకోగలిగాడు...?!

తనని మళ్ళీ కబళించిన దురలవాటును వదిలించుకోమని మహిమ ఎంతగా పోరాడిరదీ... తనెంత విదిలించికొట్టినా, సహనంతో సర్దుకుపోవటానికే ప్రయత్నించింది...!

‘‘తాగటంలోనే ఆనందం ఉంటే... అది మీరొక్కరే పొందటం సమంజసమేనా... కుటుంబం అంతటికీ కావాలి కదా... ఒంటరివాళ్ళ విషయం వేరేగానీ, భార్యా పిల్లలున్న వాళ్ళకి బాధ్యత

ఉండనక్కర్లేదా…? వాళ్ళకీ అన్నింటిలోనూ భాగం ఇవ్వాలికదా…?’’

మహిమ ఇలాంటి ప్రశ్నలతో తనను నిలదీసినపుడు… తనకి కోపం తారాస్థాయికి చేరుకునేది…! తనని బంధించాలని చూస్తున్నట్లుగా పౌరుషం వచ్చేది…! అహంకారం బుసలు కొట్టేది…! ఆ పరిస్థితుల్లో… మహిమ మీద చేయి చేసుకోవటానికీ వెనుకాడలేదు! అందుకే కదూ… వసుధ తనను చూసీ చూడగానే భయంతో పారిపోయి… వాళ్ళమ్మ వెనకాలనో, నాన్నమ్మ దగ్గరో దాక్కునేది…! ఇపుడు తలచుకుంటే… తనెంత క్రూరంగా ప్రవర్తించాడో అర్థమౌతోంది…!

తనతో ఎటువంటి బంధమూ లేదని… అర్థం అయిందో లేదోగానీ, వసూ మాత్రం తనని తండ్రిగానే గుర్తించి… తమ దగ్గరకు వచ్చెయ్యమని కోరటం… నిజంగా తనదెంత అదృష్టం…! నిజంగా వసుధ తనకా ఉత్తరం రాసి ఉండకపోతే, తనెప్పటికీ మందు వ్యసనం బారినపడి చీకటి కూపంలాంటి బ్రతుకునే గడుపుతూండేవాడేమో…!

తన జీవితానికి వెలుగును ప్రసాదించిన వెన్నెల తోరణం తన చిన్నారి కూతురు..! ఇప్పటికే తనెంతో విలువైన జీవితాన్ని పోగొట్టుకున్నాడు…! తనలోని మార్పును గుర్తిస్తుందా… మహిమ… తనని క్షమించ గలుగుతుందా…? తన జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది…? ఇలాంటి ఆలోచనలతో సతమతమవుతూ… టేబుల్ పైనే తల ఆనించి నిద్రలోకి జారుకున్నాడు అభిరామ్.

శకుంతలలోనూ ఏవేవో ఆలోచనలు చోటు చేసుకుని… నిద్రను దూరం చేసాయి! అభిరామ్‌కు తన మనసు విప్పి చెప్పినట్లుగా బయటపెట్టిన తన కోరిక అర్థమైందా…? తన ఇష్టాన్ని గుర్తుచేయగానే, గౌరవించినట్లుగా ‘కుంతలా’ అని పిలవటం… తనకి ఆనందం కలిగించింది…! అయితే తన భావం అభిరామ్‌కు అర్థమైనట్లో, కానట్లో తెలియలేదు!

బహుశా… సమయం తీసుకుని ఆలోచించి నిర్ణయించుకోవాలను కుంటున్నాడేమో…! తనకూ ఆ మాట చెబితే… ఎంతో ఆలోచించే నిర్ణయానికి వచ్చానని క్షణం అయినా జాగు చేయకుండా చెప్పేస్తుంది…!

అభిరామ్ పరిచయం అయినప్పటినుండీ… అతని పట్ల… తనకి ఇష్టం ఏర్పడిరది. అందరిలోకీ ప్రత్యేకమైన వ్యక్తిగా అనిపించాడు.!

అతని తెలివితేటలు, ఆలోచనా విధానం… అన్నీ విశిష్టమైనవే…! హోదా ఉన్న వ్యక్తులపట్ల ఎంతటి గౌరవాభిమానాలను చూపిస్తాడో, అలాగే పనివారిపట్ల కూడా అంతటి ఆదరాభిమానాలను చూపించటం తను గుర్తించింది!

పిల్లలపట్ల, పెద్దలపట్లా కూడా ప్రేమను వ్యక్తం చేయగలగటం… అతని గొప్ప మనసుకు తార్కాణమే…!

అక్కడ చేరిన వాళ్ళందరూ దుర్వసనాలను వదిలించుకోవటానికి మెల్లమెల్లగా ప్రయత్నాలు సాగిస్తూంటే… అభిరామ్ మాత్రం తన సంకల్పబలంతో చాలా తొందరగానే ఆ అలవాటు నుండి బయట పడగలగటం… తనకి గొప్ప ఆశ్చర్యాన్ని కలిగించింది!

గట్టిగా తలచుకుని ప్రయత్నంచేస్తే, సాధించలేనిదంటూ ఉండదని అభిరామ్ నిరూపించటమే కాదు, చాలామందికి ఉదాహరణగా నిలిచాడు! తరువాత ఎందరికో చేయూత నందిస్తున్నట్లుగా ఎన్నెన్నో కార్యక్రమాలను చేపట్టగలిగాడు!

తన ఒక్కడి క్షేమం, ఆరోగ్యం గురించి మాత్రమే ఆరాటపడకుండా, ఎందరినో ఆ ఊబినుండి బయట పడెయ్యాలనే ఆశయంతో తన శక్తినంతా వినియోగించి ప్రణాళికలు సిద్ధం చేయగలుగుతున్నాడు. శిఖరం మీద నిలబడినట్లుగా ఉన్న అభిరామ్ తన చేయి అందుకోవటానికి... ఆసక్తి చూపిస్తే, తనంత అదృష్టవంతురాలు ఇంకొకరు ఉండబోరు...!

తను ఎన్నోసార్లు తన అభిమానాన్ని ప్రకటించే ప్రయత్నాలు చేసింది...! అభిరామ్‌కీ తనపట్ల అభిమానం ఉన్నా, వయసు రీత్యా తేడా ఎక్కువగా ఉంటుందని వెనుకంజవేసి... తన ఇష్టాన్ని దాచిపెడుతున్నాడేమోననే అనుమానం వచ్చింది! అందుకే కదూ, సమయం చూసి ఆ విషయంలోనూ తనకు అభ్యంతరం ఉండదన్నది తెలియజేసింది!

ఒక చిన్నారి పాప వలన మందు వ్యసానానికి దూరం కావాలనే ఆలోచనతో అక్కడ చేరినట్లుగా తనకు చెప్పాడు. తనని చూపించే అవకాశం త్వరలో వస్తుందేమోననే ఆశాభావం ప్రకటించాడు! అంటే... ఆ చిన్నారి ఏదైనా అనాధాశ్రమంలోగానీ, బంధువుల పోషణలో గానీ ఉందా...?

ఒకవేళ అభిరామ్... తనకు స్ఫూర్తినిచ్చిన ఆ చిన్నారిని ప్రేమగా పెంచాలనుకున్నా తనకు ఎటువంటి అభ్యంతరం ఉండదని తెలియజేస్తుంది!

అభిరామ్‌తో జీవితాన్ని పంచుకోగల అదృష్టం కలిగితే... ఆ చిన్నారికీ ఇష్టంగా తను తల్లి కాగలదు!

ఇలాంటి కలలలో తేలిపోతూ ఆ రాత్రి గడిపింది శకుంతల.

* * *

ఆ తరువాత వారం రోజులు గడిచిపోయాయి.

అభిరామ్ ఒక నాటిక రచన పూర్తి చేయటం... నలుగురైదుగురు పిల్లల్ని, ఇద్దరు ముగ్గురు పెద్దల్నీ ఎన్నిక చేసుకోవటం... ఎక్కడెక్కడ చిత్రీకరించాలో నిర్ణయించుకోవటం... లాంటి ఏర్పాట్లన్నీ పూర్తయి... చిత్రీకరణా ప్రారంభం అయింది!

అన్ని విషయాలూ ముందుగా సిద్ధం చేసుకోవటం వలన పనులన్నీ ఏ ఆటంకం లేకుండా పూర్తయి పోతుంటాయి.

ఆ రోజు... ఇద్దరు చిన్న పిల్లలు, శకుంతలతోనే చిత్రీకరణ ఉంది. అభిరామ్‌తో ఎక్కువసేపు గడపవచ్చనే ఆలోచనతో శకుంతలకు చాలా ఉత్సాహంగా ఉంది.

''మీరింత తొందరగా రచన పూర్తిచేసి షూట్ చేయటం మొదలు పెట్టేస్తారని అనుకోలేదు...'' అంది అభిరామ్‌తో.

‘‘నీకోసమే… తొందరగా పూర్తిచేయాలనుకున్నా…!’’ అభిరామ్ జవాబు వినగానే శకుంతలకు పట్టపగ్గాలు లేనంత ఆనందం కలిగింది!

‘‘నిజంగా…?’’ అంటూ కళ్ళు పెద్దవి చేసి చూసింది అభిరామ్ వైపు… చూపుల్లోనే తన ఇష్టాన్నంతా కుమ్మరించేసినట్లు…!

‘‘అవును… మనోజా…! నీకు ఆనందం కలిగించాలనే కోరికతోనే రాత్రిళ్ళు ఎక్కువసేపు మేల్కొని పూర్తిచేశాను…!’’ నిజాయితీగా అన్నాడు అభిరామ్.

శకుంతల హాయిగా నవ్వి… ‘‘నాటికలోని పేరుతోనే పిలిచారు… అంతగా ఆ నాటికలో లీనమైపోయారా…?’’ అనడిగింది.

‘‘అదేంకాదు… నువ్వే చెప్పావుగా, దీనిలో నటించాక నిన్నందరూ ‘మనోజ’ గా గుర్తుపెట్టుకోవాలని…! అందుకే, నీ కోరిక తీర్చటం కోసమే… ముందుగా నేనే ఆ పని చేయాలనుకుని… అలా పిలిచాను…!’’

అభిరామ్ ఇచ్చిన వివరణకూ శకుంతల ఆనందం చూపిస్తూ ‘‘మీరు… నా మాటలకు అంత విలువ ఇవ్వటం నా అదృష్టమేననుకుంటున్నాను…!’’ అంది.

అభిరామ్ చిరునవ్వే సమాధానంగా పని ప్రారంభించాడు.

ఆ తరువాత… విరామ సమయంలో… ‘‘మీ డైరెక్షన్ చూస్తుంటే… నా పేరు ‘మనోజ’గా మారిపోతుందో లేదోగానీ, మీ పేరు మాత్రం మరింత మారు మోగిపోతుందన్నది మాత్రం ఖచ్చితమే…! చూడండి… నా మాటకు తిరుగులేదు! కొన్నాళ్ళల్లో… మీకే తెలుస్తుంది…!’’ అంది శకుంతల మనస్ఫూర్తిగా.

అభిరామ్ కూడా శకుంతల వైపు అభిమానంగా చూశాడు.

‘‘పేరు మారుమ్రోగిపోవటం కంటె… పిల్లల్లో, పెద్దల్లో మార్పుకు కొంతయినా ఉపకరిస్తే… ప్రయోజనం కలిగితే… అది చాలు…! అంతకన్నా ఇంకేం కావాలీ…!’’

శకుంతల నిట్టూర్చింది. ‘‘మీ పేరు ప్రఖ్యాతలకు ఆనందం కలుగుతున్నా… మీరు మరీ పైపైకి వెళ్ళిపోవటంతో… మాలాంటి వాళ్ళకి దూరం అయిపోతారేమోనని దిగులుగానూ ఉంది…!’’

అభిరామ్ చిన్నగా నవ్వాడు.

‘‘నీకు ఇంతకు ముందే చెప్పానుగా, ఎంత ఎత్తుకు వెళ్ళినా నేనొక్కడినే కాదు, నావెంట నువ్వు, మీరంతా కూడా ఉంటారని…!’’

‘‘అయితే… నిజంగా… మీ వెంట… మాలాంటివాళ్ళు ఉంటామన్నది నిజమేనా…?’’ సంబరంగా అడిగింది శకుంతల.

ఆభిరామ్ ఆశ్చర్యంగా చూశాడు.

‘‘అదేమిటి అలా అంటున్నావు…? ఎవరైనా… ఎంతటి గొప్పవారైనా సరే ఒక్కరుగా ఏదైనా సాధించగలరా చెప్పు…! నలుగురి తోడ్పాటు ఉండాల్సిందే! నేను నిజంగా ఏదైనా సాధించాననుకుంటే… అందులో మీ అందరికీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుంది…! నిజం చెప్పాలంటే… నేనిక్కడకు వచ్చిందగ్గర్నుండీ… నువ్వు చూపించిన ఆదరం, సహకారం వలనే… నేనేదైనా సాధించగలగటం సాధ్యమైంది…! వృత్తిని బాధ్యతగా, సేవా భావంతో నిర్వర్తించే నీలాంటి వాళ్ళు చాలా అరుదుగా

ఉంటారు…! నేనే కాదు, ఇక్కడున్న ప్రతీవాళ్లూ చెప్పే మాటే ఇది…!’’ అభిరామ్ మనస్ఫూర్తిగా అన్నాడు.

శకుంతలకు కళ్ళు చెమరించాయి. కళ్ళు తుడుచుకుంటూ ‘‘నా అదృష్టం ఇది…!’’ మెల్లగా తనలో తాను అనుకుంటున్నట్లుగా అంది.

వెంటనే మళ్ళీ పనిలో పడిపోయాడు అభిరామ్.

ఒక చిన్న అమ్మాయిని ఒడిలో కూర్చోబెట్టుకుని… అంతకు ముందు ప్రాక్టీసు చేయించిన సంభాషణలను మళ్ళీ చెప్పించే ప్రయత్నం చేస్తున్నాడు అభిరామ్.

శకుంతల కొంచెం దూరంలోనే నిలబడి అభిరామ్ వైపు తదేకంగా చూస్తుంటే… అభిరామ్ ‘‘ఏమిటలా చూస్తున్నావు…?’’ అనడిగాడు.

శకుంతల చిరునవ్వుతో ‘‘ఇష్టమైన వాళ్ళని ఇష్టంగా చూడాలనిపిస్తుంది. ఏం చూడకూడదా…?’’ అంటూ ఎదురు ప్రశ్న వేసింది.

అభిరామ్ చిన్నగా నవ్వాడు. ‘‘అవున్లే… నీకూ నాకే కాదు… పసిపిల్లలు, వాళ్ళ ముద్దుమాటలు, చిలిపి నవ్వులూ అంటే… ఎవరికి ఇష్టం ఉండదూ…!’’

ఆ పాప వెంటనే అభిరామ్ మెడ చుట్టూ రెండు చేతులూ వేసి ‘‘నేను బాగా చెప్పానా…?’’ అనడిగింది.

‘‘ఓ… చాలా బాగా చెప్పావు… ఇలాగే చెప్పాలి…’’ ప్రోత్సహిస్తున్నట్లుగా అభిరామ్ పాపను ముద్దుపెట్టుకున్నాడు.

శకుంతల నవ్వుతూ ‘ ఎంత అదృష్టమో…’ అని, ‘పాపది’ అంటూ ఒక సెకను తర్వాత పూర్తి చేసింది.

‘‘అవును… అదృష్టమే…! పాపది కాదు… నాది’’ అన్నాడు అభిరామ్ చిరునవ్వుతో. మళ్ళీ ‘‘కుంతలా… ఈ అదృష్టంలోనూ మీకు వాటా ఉంది…!’’ అంటూ పాప చెవిలో చిన్నగా ఏదో చెప్పాడు.

ఆ పాప అభిరామ్ ఒడి దిగి... ఛెంగుమంటూ శకుంతల దగ్గిరికి వచ్చి... అక్కడున్న కుర్చీలో కూర్చోమని... వెంటనే ఆమె ఒడిలోకి ఎగిరి దూకి కూర్చుని... ఆమెవైపు తిరిగి మెడచుట్టూ రెండు చేతులూ వేసి ''అక్కా... నా డైలాగులు చెప్పనా... బాగా చెప్పానో లేదో నువ్వూ చెప్పాలీ...!'' అంది.

శకుంతల ఆ పాప మాటలకు ముగ్ధురాలై చూస్తుంటే... తన పోర్షన్ లోని కంఠతా పట్టినవి తన సంభాషణలను అన్నింటినీ చకచకా చెప్పేసింది!

శకుంతల చాలా ఆనందంగా ''చాలా బాగా చెప్పావు, చిట్టితల్లీ...'' అంటూ ఆ పాప రెండు అరచేతుల్నీ ముద్దుపెట్టుకుంది...!

''మనోజా... ఇపుడర్థమైందా... పిల్లలతో చక్కగా కాలక్షేపం చేయగలగటం... మనదే అదృష్టం అనిపిస్తుంది కదూ...?'' అనడిగాడు అభిరామ్.

అవునన్నట్లు తలవూపుతూ ''మీరు... మీ చిన్నారి అనే చెబుతూంటారే... ఆ పాప కూడా ఇంతే ఉంటుందా... అదే వయసు గురించి...'' అనడిగింది శకుంతల.

''ఏమో... సరిగా చెప్పలేను. షుమారుగా ఇంతే ఉంటుంది. నేను చూసి చాలానాళ్ళయింది. చెప్పానుగా, కలుసుకునే అవకాశం వస్తే, నిన్నూ పరిచయం చేస్తాను...!''

శకుంతలకి ఆ మాటలతో ఏదో ధైర్యం వచ్చినట్లయింది...! అభిరామ్ తనని కుంతలా, మనోజా అనీ పిలవటంతో... చాలా ఉత్సాహంగా అనిపించింది. ఆ పిలుపులు మనసులో మళ్ళీ మళ్ళీ వినిపిస్తూ గిలిగింతలు రేపుతున్న అనుభూతి కలిగింది...!

అభిరామ్ చేయి అందుకోగలిగే రోజు ఎంతో దూరంలో లేదనుకుంటూ సంతృప్తి చెందింది...!

* * *